PCW తెలుగు దినపత్రిక



# తెలంగాణ గ్రామర్ స్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం





**కల్లూరు, జూన్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్)** :కల్లూరులోని తెలంగాణ గ్రామర్ స్కూల్ (ఇంగ్లీష్ మీడియం)లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో యోగా ప్రాముఖ్యత, ఆరోగ్యకరమైన జీవన విధానంలో యోగా పాత్ర, శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత మరియు ఏకాగ్రత పెంపొందించడంలో యోగా అందించే ప్రయోజనాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ యోగా భారతదేశం, ప్రపంచానికి అందించిన అమూల్యమైన కానుక అన్నారు. ప్రతి విద్యార్థి ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన భవిష్యత్తును నిర్మించుకోవచ్చు అన్నారు. యోగా మన శారీరక, మానసిక ఆరోగ్యాలను మెరుగుపరచడంతో పాటు క్రమశిక్షణను కూడా పెంపొందిస్తుంది అని తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన యోగా ఆసనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం యోగా ప్రతిజ్ఞ చేయించి కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, యాజమాన్యం పాల్గొన్నారు.

# 53వ డివిజన్‌లో రూ.20 లక్షలతో సీసీ డ్రైన్ పనులకు శంకుస్థాపన




**కరీంనగర్ టౌన్ జూన్ 20 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 53వ డివిజన్‌లో రూ.20 లక్షల సుడా నిధులతో చేపట్టనున్న సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే నగర పాలక సంస్థ లక్ష్యమని అన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీటి నిల్వలు, పారుదల సమస్యలు తలెత్తకుండా సీసీ డ్రైన్ నిర్మాణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు.నగరంలోని అన్ని డివిజన్‌లలో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను ప్రాధాన్యత ఆధారంగా అమలు చేస్తున్నామని, మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు నగర పాలక సంస్థ కట్టుబడి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, 53వ డివిజన్ కార్పొరేటర్ కొంపెల్లి శ్వేత రమన్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# పోచంపల్లి శ్రీనివాస్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఎమ్మెల్యే రేవూరి దిష్టిబొమ్మ దహనం



**పరకాల, జూన్ 20 (పీసీడబ్ల్యూ న్యూస్):**వరంగల్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళా అభ్యున్నతి, సామాజిక సంక్షేమం లక్ష్యంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలపై స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ నాయకులు కొక్కిరాల రాకేష్ రావు ఆధ్వర్యంలో పరకాలలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, పోచంపల్లి ఫౌండేషన్ ద్వారా పార్టీలకతీతంగా మహిళల సాధికారత, విద్య, ఆరోగ్యం మరియు సామాజిక అభివృద్ధి కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అలాంటి కార్యక్రమాలను రాజకీయ కోణంలో విమర్శించడం సమంజసం కాదని పేర్కొన్నారు.ప్రజా ప్రయోజనాల కోసం చేపడుతున్న సేవా కార్యక్రమాలపై బాధ్యతారహితంగా వ్యాఖ్యానించడం బాధాకరమని, మహిళల సంక్షేమం కోసం జరుగుతున్న కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన ప్రజాప్రతినిధులు వాటిని విమర్శించడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు.కొక్కిరాల రాకేష్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, పోచంపల్లి ఫౌండేషన్ సేవా కార్యక్రమాల మద్దతుదారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.సామాజిక సేవను రాజకీయాలకు అతీతంగా చూడాలని, మహిళా అభ్యున్నతి మరియు సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని వక్తలు పిలుపునిచ్చారు.

# ప్రజల కళ్లలో వెలుగు.. ప్రజల గుండెల్లో భూక్యా జంపన్న


## రెడున్నరేళ్లలో 29 ఉచిత కంటి వైద్య శిబిరాలు.. 4,032 మందికి విజయవంతంగా కంటి ఆపరేషన్లు

## 17,352 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి పేదలకు అండగా నిలిచిన సేవా యజ్ఞం



**ములుగు,జూన్ 20(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ములుగు జిల్లా బీఆర్ఎస్ నాయకుడు భూక్య జంపన్న సేవా కార్యక్రమాలు జిల్లావ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నాయి. కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో గత రెండున్నర సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలు వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయి.భూక్య జంపన్న ఆధ్వర్యంలో ఇప్పటివరకు ములుగు జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల్లో 29 సార్లు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల ద్వారా 17,352 మందికి బీపీ, షుగర్, ఇతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, అవసరమైన వారికి వైద్యుల సూచనల మేరకు ఉచితంగా మందులు అందించారు. అలాగే 4,032 మందికి విజయవంతంగా కంటి ఆపరేషన్లు చేయించారు. 29వ విడత ఉచిత కంటి ఆపరేషన్లు పూర్తి చేసుకున్న వృద్ధులు, ప్రజలను ప్రత్యేక బస్సుల్లో సురక్షితంగా వారి గ్రామాలకు తరలించే ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా భూక్య జంపన్న స్వయంగా ప్రజలతో కలిసి ప్రయాణిస్తూ, ఆపరేషన్ అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రజల ఆరోగ్యం పట్ల ఆయన చూపుతున్న శ్రద్ధను లబ్ధిదారులు అభినందించారు."ఇంటికి పెద్ద కొడుకులా అండగా నిలుస్తున్నారు" అంటూ పలువురు వృద్ధులు భూక్య జంపన్న సేవలను కొనియాడారు. ఎలాంటి స్వార్థం లేకుండా పేదల కోసం నిరంతరం సేవలు అందిస్తు న్నారని, ఆయన సేవలు తమ కుటుంబాలకు కొత్త ఆశలను తీసుకొచ్చాయని పేర్కొన్నారు.కంటి చూపు సమస్యలపై ఎక్కడ చర్చ జరిగినా గుర్తుకు వచ్చే పేరు గా భూక్య జంపన్న నిలుస్తున్నారని స్థానికులు చెబుతు న్నారు. వేలాది మందికి వెలుగులు పంచుతున్న ఆయన సేవా కార్యక్రమాలు ములుగు జిల్లాలో ఆదర్శంగా మారాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# కిసాన్ సమ్మాన్ నిధితో రైతులకు ఆర్థిక భరోసా: బండి సంజయ్






**కరీంనగర్ టౌన్ జూన్ 20 (పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం రైతులకు ఆర్థిక భరోసాను కల్పిస్తూ వారి వ్యవసాయ ఆదాయాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట కేవీకేలో నిర్వహించిన పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 23వ విడత నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసిన కార్యక్రమాన్ని వర్చువల్ ద్వారా వీక్షించారు.అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ, 2019లో ప్రారంభమైన పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా ఇప్పటివరకు దేశవ్యాప్తంగా రూ.5 లక్షల కోట్లకుపైగా నిధులు రైతుల ఖాతాల్లో జమయ్యాయని తెలిపారు. 23వ విడత కింద రూ.18,880 కోట్లను విడుదల చేయగా, దేశంలోని 9.44 కోట్ల మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు.నీతి ఆయోగ్ అధ్యయనం ప్రకారం కిసాన్ సమ్మాన్ నిధి పొందిన రైతుల్లో 92 శాతం మంది ఆ మొత్తాన్ని విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు వంటి వ్యవసాయ అవసరాలకే వినియోగిస్తున్నారని, 85 శాతం మంది రైతులు తమ ఆదాయం పెరిగిందని వెల్లడించారని చెప్పారు. ఇది పథకం విజయానికి నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు.వ్యవసాయ రంగానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, 2014తో పోలిస్తే వ్యవసాయ బడ్జెట్‌ను ఐదు రెట్లు పెంచామని తెలిపారు. ఈ ఏడాది వ్యవసాయం, రైతు సంక్షేమం కోసం రూ.1.40 లక్షల కోట్లకు పైగా కేటాయించామని, పీఎం-కిసాన్ పథకం కోసమే రూ.60 వేల కోట్లు కేటాయించినట్లు వివరించారు.రైతులపై ఆర్థిక భారం తగ్గించేందుకు ఎరువులపై భారీ సబ్సిడీ అందిస్తున్నామని బండి సంజయ్ తెలిపారు. యూరియా, డీఏపీ తదితర ఎరువులపై కేంద్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో సబ్సిడీ భరిస్తోందని, ఒక్కో ఎకరానికి సుమారు రూ.18 వేల మేర రైతులకు ప్రయోజనం కలుగుతోందని చెప్పారు. ఇప్పటివరకు ఎరువుల సబ్సిడీ కోసం రూ.12 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు.అయితే అధికంగా రసాయన ఎరువుల వినియోగం ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, రైతులు క్రమంగా ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని సూచించారు. ప్రారంభంలో కొంత ఇబ్బంది ఎదురైనా, తర్వాత ప్రకృతి వ్యవసాయం ద్వారా మెరుగైన ఆదాయంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించే అవకాశం ఉంటుందని తెలిపారు.రైతు సంక్షేమానికి కేంద్రం అమలు చేస్తున్న పథకాలకు మద్దతు ఇవ్వాలని, అభివృద్ధి లక్ష్యాల సాధనలో రైతులు భాగస్వాములు కావాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు.

# నవ్వుల నినాదంగా మిమిక్రీ కళ..



## - హైదరాబాద్ సప్తాహంలో ఖమ్మం మిమిక్రీ సుధాకర్ 'నవ్వుల' నైపుణ్యం!

## - మిమిక్రీ కేవలం వినోదం కాదు.. వ్యక్తిత్వ వికాసానికి, సామాజిక చైతన్యానికి వేదిక



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** మనుషుల ముఖాల్లో చిరునవ్వులు పూయించడం ఒక కళ అయితే, ఆ నవ్వుల్లో సందేశాన్ని జోడించి సమాజాన్ని ఆలోచింపజేయడమే మిమిక్రీ కళాకారుల ప్రత్యేకత. అనుకరణ కళ ద్వారా వ్యక్తులను ఆకట్టుకోవడమే కాకుండా, ఆలోచనా విధానాన్ని సానుకూల దిశగా మలిచే శక్తి మిమిక్రీకి ఉందని మరోసారి రుజువైంది.శ్రీ త్యాగరాయ గాన సభ, ఆనందలహరి, హైదరాబాద్ మెజీషియన్స్, భవిరి ఆర్ట్స్, మిమిక్రీ ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని శ్రీ త్యాగరాయ గాన సభ సంగీత నాట్య కళా వేదికపై ఈ నెల 15వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఘనంగా నిర్వహించిన "మిమిక్రీమ్యాజిక్‌మైమ్ సప్తాహం ఫెస్టివల్" కళాభిమానులను విశేషంగా అలరించింది. ఈ ప్రతిష్ఠాత్మక ఉత్సవంలో ఖమ్మం జిల్లాకు చెందిన సీనియర్ మిమిక్రీ కళాకారుడు, స్టేజ్ యాంకర్ మిమిక్రీ సుధాకర్ తన అద్భుత ప్రదర్శనతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ముఖ్యంగా ప్రముఖ సినీ నటుడు, మాజీ మంత్రి బాబు మోహన్ డైలాగులను తనదైన శైలిలో అనుకరించి సభలో నవ్వుల జల్లు కురిపించారు. ప్రేక్షకులు చప్పట్లతో అభినందించగా, బాబు మోహన్ స్వయంగా సుధాకర్ ప్రతిభను కొనియాడడం విశేషంగా నిలిచింది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బాబు మోహన్ మాట్లాడుతూ.. మిమిక్రీ కళాకారులు సమాజానికి ఆనందాన్ని పంచే సృజనాత్మక శక్తులని అభివర్ణించారు. ఒక మంచి మిమిక్రీ కళాకారుడు కేవలం స్వరాలను మాత్రమే కాదు, మనుషుల భావోద్వేగాలను కూడా ప్రతిబింబించగలడని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా కళా జనార్ధన మూర్తి, మద్దాలి రఘురాం, నేరెళ్ల శ్రీనాథ్ పాల్గొని కళాకారులను అభినందించారు. కార్యక్రమ సమన్వయకర్తగా ప్రముఖ మిమిక్రీ కళాకారుడు మల్లం రమేష్ వ్యవహరించగా, మెజీషియన్ రామడుగు వసంత్, భవిరి శివ తదితరులు హాజరయ్యారు.కళాకారుల ప్రతిభకు ప్రోత్సాహం అందిస్తూ, మిమిక్రీ వంటి సృజనాత్మక కళలకు వేదికలు కల్పించడం ద్వారా యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు సామాజిక బాధ్యతను కూడా పెంచవచ్చని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ అవకాశాన్ని కల్పించిన సీనియర్ మిమిక్రీ ఆర్టిస్ట్, మెజీషియన్ మల్లం రమేష్‌కు మిమిక్రీ సుధాకర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు."మిమిక్రీ అనేది కేవలం అనుకరణ కాదు... నవ్వులతో మనసులను గెలుచుకుని, సందేశాలతో సమాజాన్ని మార్చగల సజీవ కళ" అని కార్యక్రమంలో పలువురు కళాభిమానులు వ్యాఖ్యానించారు.

# చిట్యాల పోలీసుల 'కార్డాన్ అండ్ సెర్చ్' ఆపరేషన్

**ముగ్గురిపై కేసులు నమోదు**

**గుడుంబా పానకం, నిషేధిత అంబర్ గుట్టా స్వాధీనం**

**చిట్యాల జూన్ 20 (పీసీడబ్ల్యూ న్యూస్):** చిట్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సిఐ) మల్లేష్ ఆధ్వర్యంలో, ఎస్ఐ సతీష్ నేతృత్వంలో చల్లగరిగ గ్రామంలో ఉదయం ముమ్మరంగా కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 15 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.గ్రామంలోని ప్రతి వీధిని, అనుమానాస్పద ప్రాంతాలను క్షుణ్ణంగా శోధించిన పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పలు కీలక చర్యలు చేపట్టారు. ఈ తనిఖీలలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ముగ్గురు (3) వ్యక్తులపై పోలీసులు కేసులు నమోదు చేశారు.నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా గుడుంబా, నిషేధిత పదార్థాలు విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను గుర్తించి వారిపై చట్టపరమైన కేసులు



నమోదు చేయడం జరిగింది.గ్రామంలో సరైన పత్రాలు (Proper Documents) లేని వాహనాలను గుర్తించి, వాటిని తనిఖీ చేసి వాహనదారులకు ఫైన్ విధించారు. అనంతరం చల్లగరిగ గ్రామ ప్రజలను ఉద్దేశించి పోలీసులు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యంగా పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బాధితులు ఎవరైనా ఉంటే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు లేదా cyber-crime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. అలాగే గుడుంబా వంటి వ్యసనాలకు దూరంగా ఉండి గ్రామ అభివృద్ధికి సహకరించాలని



పిలుపునిచ్చారు.అదేవిధంగా గంజాయి, గుడుంబా వంటి వ్యసనాలకు యువత, గ్రామస్తులు దూరంగా ఉండాలని.. మైనర్ పిల్లలకు బైక్‌లు ఇచ్చి ప్రమాదాల బారిన పడేయవద్దని తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. గ్రామ అభివృద్ధికి, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ ఆపరేషన్‌లో చిట్యాల సిఐ మల్లేష్ గారి పర్యవేక్షణలో, ఎస్ఐ పోచంపల్లి సతీష్‌తో పాటు, ఎస్ఐ-2 రాజన్, ఎస్ఐ-3 ఈశ్వరయ్య మరియు 15 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సామాజిక విప్లవానికి సరికొత్త సారథులు

**- ఎస్సీ సంక్షేమ సంఘం నూతన కమిటీల నియామకం!**

**- ఖమ్మం మట్టి బిడ్డకు అరుదైన గౌరవం**

**- జిల్లా అధ్యక్షుడిగా పడిశాల నవీన్ కుమార్**

**ఖమ్మం ప్రతినిధి, జూన్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** హైదరాబాద్ కేంద్రంగా అణగారిన వర్గాల ఆశాదీపమై నిలుస్తున్న 'ఎస్సీ సంక్షేమ సంఘం' రాష్ట్రవ్యాప్తంగా సామాజిక చైతన్యాన్ని రగిలించేందుకు సరికొత్త అడుగులు వేసింది. సమాజంలో వెనుకబడిన గుండెలకు అండగా నిలబడేందుకు, మహిళా, యువజన శక్తులను ఏకం చేస్తూ నూతన కమిటీలను గురువారం ఘనంగా ప్రకటించింది. సంఘం జాతీయ అధ్యక్షుడు తీగల అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఈ నియామకాలు జరిగాయి. కేవలం పదవుల పంపకంలా కాకుండా.. నిరంతరం సమాజసేవలో తరిస్తూ, లీడర్‌షిప్ నైపుణ్యాలతో ఎస్సీ వర్గాల అభ్యున్నతికి అహర్నిశలూ శ్రమిస్తున్న నిజమైన శ్రామికులను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలోనే ఖమ్మం జిల్లా మట్టి బిడ్డ, సేవాతత్పరుడు పడిశాల నవీన్ కుమార్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా నియామకమయ్యారు. ఆయనతో పాటు జిల్లా కార్యదర్శిగా దుమాల నాగరాజు బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన మరికొందరు నిస్వార్థ నాయకులకు కూడా ఈ సామాజిక యజ్ఞంలో కీలక భాగస్వామ్యం కల్పించారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు తీగల అశోక్ కుమార్





మాట్లాడుతూ... ఈరోజు నాయకత్వం అణగారినవర్గాల గుండెల్లో ఆత్మవిశ్వాసం అన్నారు."పదవులు అలంకారాలు కావు.. అవి సమాజ మార్పు కోసం లభించిన ఆయుధాలు అన్నారు. నూతన నాయకత్వం గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రతి ఎస్సీ బిడ్డకూ అండగా నిలబడాలన్నారు. ఎస్సీ సంక్షేమ సంఘం కేవలం ఒక సంస్థ కాదు.. అది షెడ్యూల్డ్ కులాల సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ సాధికారతకు దిక్సూచి. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి గడపకూ చేరేలా అవగాహన కల్పించడం, పేద విద్యార్థుల చదువులకు రెక్కలు తొడగడం, నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గాలు చూపి వారి జీవితాల్లో వెలుగులు నింపడం ఈ సంఘం యొక్క ముఖ్య ఉద్దేశం. సామాజిక న్యాయం కోసం, హక్కుల



ఎస్సీ సంక్షేమ సంఘం
SC SANKSHEMA SANGAM
(Regd. No. 957)
Office : 3-6-93/A, Ramanthapur, Indira Nagar, Hyderabad - 500013.

DISTRICT COMMITTEE, WOMEN'S COMMITTEE & YOUTH COMMITTEE APPOINTMENT NOTIFICATION

Ref. No.: SCWS/TG/2026/01 — Date: 18-06-2026

Under the directions of **Mr. Teegala Ashok Kumar**, National President of **SC Welfare Association**, and after careful consideration of their social commitment, leadership qualities, and dedication towards the welfare and empowerment of Scheduled Castes, the following leaders are hereby appointed to various positions in the District Committee, Women's Committee, and Youth Committee of the SC Welfare Association.

| S. No. | Name | Designation | District / Constituency |
|---|---|---|---|
| 1. | Padishala Naveen Kumar | District President | Khammam District |
| 2. | Kuntala Shankar | District Vice President | Mancherial District |
| 3 | Peruguvar Anand Rao | District Secretary | Komaram Bheem Asifabad District |
| 4. | Dumala Nagaraju | District Secretary | Khammam District |
| 5. | Bolle Shankar | District Secretary | Sangareddy District |
| 6 | Jumidi Sanjeev Kumar | District Secretary | Komaram Bheem Asifabad District |
| 7 | Borkut Prameela | Women's Wing President | Sirpur-T Constituency |
| 8 | Konamani Rajesh | District Secretary | Hyderabad District |
| 9 | Gandamalla Veeranjaneyulu | District Youth Wing Secretary | Suryapet District |

The above-mentioned leaders are entrusted with the responsibilities and powers associated with their respective positions in the SC Welfare Association. These appointments shall come into effect immediately from the date of issuance of this notification.

We are confident that the newly appointed office bearers will work with dedication and commitment towards achieving the objectives of the Association and promoting the overall development, welfare, and empowerment of Scheduled Castes.

On behalf of the SC Welfare Association, we extend our heartfelt congratulations and best wishes to all the newly appointed leaders and wish them great success in their responsibilities.

SC WELFARE ASSOCIATION (Regd. No. 957) SCWS HYDERABAD TELANGANA STATE COMMITTEE

JAI BHIM!

(TEEGALA ASHOK KUMAR)
National President
SC Welfare Association

"Educate, Agitate, Organize" — Dr. B. R. Ambedkar

scssangham@gmail.com | 9666634001 | www.scsankshemasangam.org

పరిరక్షణ కోసం ఈ సైన్యం నిరంతరం పోరాడుతూనే ఉంటుంది.కొత్తగా బాధ్యతలు స్వీకరించిన నూతన సారథులు.. ఆశయ సాధనకై, ప్రజాక్షేమమే పరమావధిగా సమిష్టిగా ముందుకు సాగాలని జాతీయ అధ్యక్షుడు తీగల అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సరికొత్త నియామకాలతో క్షేత్రస్థాయిలో సంఘం మరింత బలోపేతమై, పేదవాడి గొంతుకగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సందర్భంగా నూతనంగా ఎంపికైన నాయకులకు సంఘం సభ్యులు, అభ్యుదయవాదులు, సామాజిక కార్యకర్తలు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి నేతృత్వంలో సమాజంలో సరికొత్త కాంతి రేఖలు ప్రసరించాలని ఆకాంక్షించారు.

# స్కూల్ పేరుతో పుస్తకాల విక్రయం....గోడౌన్ సీజ్

**సత్తుపల్లిలో విద్యాశాఖ అధికారుల ఆకస్మిక దాడులు**

**ముద్రించిన పుస్తకాలు, బెల్టులు, ఇతర సామగ్రి స్వాధీనం**

**ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీపై చర్యలు తప్పవని హెచ్చరిక**

**సత్తుపల్లి, జూన్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :**సత్తుపల్లి పట్టణంలోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థకు చెందిన పేరుతో ముద్రించిన నోట్‌బుక్కులు, పాఠ్యపుస్తకాలు, బెల్టులు, ఇతర విద్యా సామగ్రిని అక్రమంగా విక్రయిస్తున్న గోడౌన్‌ను విద్యాశాఖ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. సత్తుపల్లి విద్యాలయం సమీపంలోని ఓ ఇంట్లో ఈ సామగ్రిని నిల్వ ఉంచి విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు విద్యార్థి సంఘ నాయకులు విద్యాశాఖ అధికారులకు సమాచారం అందించారు.దీనిపై



స్పందించిన మండల విద్యాధికారి (ఎంఈఓ) రాజేశ్వరరావు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భారీ సంఖ్యలో స్కూల్ పేరుతో ముద్రించిన నోట్‌బుక్కులు, పాఠ్యపుస్తకాలు, బెల్టులు, ఇతర సామగ్రి నిల్వ ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించగా, వారి ఆదేశాల మేరకు గోడౌన్‌కు తాళం వేసి సీజ్ చేశారు. తదుపరి విచారణ అనంతరం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులతో పాటు ముద్రించిన పుస్తకాలు, నోట్‌బుక్కులు, యూనిఫా



మ్‌లు, బెల్టులు, ఇతర సామగ్రిని తప్పనిసరి చేస్తూ తల్లిదండ్రులపై వేల రూపాయల అదనపు భారం మోపుతున్నాయని ఆరోపించారు. విద్యాహక్కు చట్టం, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ అక్రమాలపై విద్యాశాఖ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లాలోని ఇతర విద్యా సంస్థల్లో జరుగుతున్న ఇలాంటి అక్రమ విక్రయాలను కూడా వెలుగులోకి తీసుకొస్తామని, విద్యను వ్యాపా రంగా మార్చి విద్యార్థులపై ఆర్థిక భారం మోపే యాజ మాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# నీట్ ఎగ్జామ్ విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం

**ఖమ్మం ప్రతినిధి, జూన్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జూన్ 21న జరగనున్న నీట్ రీ-ఎగ్జామినేషన్‌కు హాజరయ్యే విద్యార్థులకు టీజీఎస్‌ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ప్రకటించింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు టిజిఎస్‌ఆర్టీసీ ఎండి వై. నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారని నీట్ పరీక్ష విద్యార్థులు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఖమ్మం డిపో మేనేజర్ మేడా శివప్రసాద్ పేర్కొన్నారు.విద్యార్థులు తమ హాల్ టికెట్ చూపించి ఇంటి నుంచి పరీక్ష కేంద్రాలకు వెళ్లి, తిరిగి ఇంటికి చేరుకునే వరకు టీజీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. ఈ సౌకర్యం ఏసీ సర్వీసులను మినహాయించి అన్ని బస్సుల్లో ఈ ఉచిత బస్ ప్రయాణం





అందుబాటులో ఉంటుందన్నారు.సుమారు 73 వేల మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్న నేపథ్యంలో, పరీక్ష కేంద్రాలకు వెళ్లే మార్గాల్లో అదనపు బస్సులను సంస్థ ఏర్పాటు చేసిందన్నారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ముందుగానే బయలుదేరి పరీక్ష కేంద్రాలకు సమయానికి చేరుకోవాలని సూచించారు. ఈ ఉచిత ప్రయాణ సౌకర్యం జూన్ 21 తొలి బస్సు సర్వీస్ నుంచి అర్ధరాత్రి వరకు అమల్లో ఉంటుంది. ప్రయాణానికి సంబంధించి సహాయం కోసం టీజీఎస్‌ఆర్టీసీ హెల్ప్‌లైన్ నంబర్లు 040-23450033, 040-69440000 ను సంప్రదించాలని ఖమ్మం డిపో మేనేజర్ మేడా శివప్రసాద్ సూచించారు.

# ఇది నా విజయం కాదు.. దేశభక్తుల విజయం!

**● తిరంగా యాత్ర కేసు కొట్టేయడంతో బేగంబజార్‌లో లడ్డు యాదవ్ సంబరాలు**





**హైదరాబాద్, జూన్ 20(పిసిడబ్ల్యూ న్యూస్):** తిరంగా యాత్ర చేసినందుకు పోలీసులు తనపై పెట్టిన కేసులను న్యాయస్థానం కొట్టివేయడంతో భగత్ సింగ్ యువసేన నాయకులు పెద్ద ఎత్తున్న సంబరాలు జరుపుకున్నారు.. బేగంబజార్ ఛత్రి వద్ద భగత్ సింగ్ యువసేన రాష్ట్ర అధ్యక్షులు లడ్డు యాదవ్ ఆధ్వర్యంలో కార్యకర్తలతో కలిసి చౌరస్తా వద్ద బాణాసంచా పేల్చి మిఠాయులు తినిపించుకుంటూ సంబరాలు జరుపుకున్నారు.. ఈ సందర్భంగా లడ్డు యాదవ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా 2024 ఆగష్టు 15వ తేదీన బేగంబజార్ ఛత్రి వద్ద నుండి భగత్ సింగ్ యువసేన ఆధ్వర్యంలో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించినట్టు తెలిపారు.. ఈ సందర్భంగా షాహినాయత్ గంజ్ పోలీసులు తనపై సుమోటోగా ఎలాంటి ఆధారాలు లేకుండా కేసును నమోదు చేసారని అయన తెలిపారు.. ఈ కేసును నాంపల్లి న్యాయస్థానం విచారణ చేపట్టి కొట్టివేసిందని అయన వెల్లడించారు.. ఈ కేసులో పోలీసులు న్యాయస్థానానికి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో తన వైపు న్యాయం గెలిచిందని ఆనందం వ్యక్తం చేశాడు.. ఇది నా సొంత విజయం కాదని దేశ భక్తుల విజయం, ఇదే స్ఫూర్తితో ఆగష్టు 15న భారీ తిరంగా యాత్రను నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.. ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ యువసేన నాయకులు గోరక్షక్ దళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శంకర్ యాదవ్, సూర్య శుక్ల, సుమిత్ యాదవ్, రాహుల్ ఓజా, విక్కీ సింగ్, కన్నయ్యలాల్, తదితరులు పాల్గొన్నారు.

# గుర్తింపు లేని పాఠశాలను అడ్డుకుంటాం..





**● పుస్తకాల పేరుతో దోపిడీ, ● యూనిఫామ్స్ పేరుతో వసూళ్లను నిలువరిస్తాం**

**● నిద్రమత్తులో విద్యాశాఖ..? ● ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ**

**ఖమ్మం ప్రతినిధి, జూన్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రైవేట్, కార్పొరేట్ ల పేరుతో అక్రమంగా నడుస్తున్న గుర్తింపులేని పాఠశాలను అడ్డుకుంటామని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ అన్నారు. ఖమ్మం నగరంలో శనివారం ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ. జిల్లావ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో కొన్ని ఇష్టారాజ్యంగా దోపిడికి తెరలేపాయని, అడ్మిషన్స్ నుండి యూనిఫామ్స్ వరకు పుస్తకాల నుంచి బస్సు, ఫీజుల వరకు ప్రతి అంశాన్ని ప్రవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఆదాయ వనరుగా విద్యాసంస్థలు వ్యాపార కేంద్రాలుగా మారాయి అన్నారు. పెరుగుతున్న ఫీజులు, అదనపు ఫీజులతో పేద మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియంత్రించాల్సిన విద్యాశాఖ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఎటువంటి అనుమతులు లేకపోయినా. పెద్దపెద్ద బిల్డింగ్స్ లో పాఠశాలలో ఏర్పాటు చేయడంతో పాటు రంగురంగుల బ్రోచర్లు, హోర్డింగ్స్ లతో విద్యార్థుల తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తూ విద్య హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జిల్లా వ్యాప్తంగా గుర్తింపు లేని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అటువంటి పాఠశాలలపై ప్రత్యక్షంగా దాడులు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర సమితి సభ్యులు బుర్ర మనోజ్, శివ నాయక్, పవన్, గోపి, చైతన్య, వెంకట్, రాంబాబు, రాము, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మాతృకర్మ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**హనుమకొండ,జూన్ 20 (పిసిడబ్ల్యూ న్యూస్):**
హనుమకొండలో నిర్వహించిన కీ.శే. శాలిని మాతృకర్మ కార్యక్రమంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.పరకాల మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా అనిత రామకృష్ణ పెద్దన్న కుమారుడు, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 53వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సోదా కిరణ్ కుమార్ సతీమణి కీ.శే. శాలిని మాతృకర్మ కార్యక్రమం హనుమకొండలోని వారి నివాసంలో శనివారం జరిగింది.ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కూడా పాల్గొన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పరకాల మండల మాజీ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, నడికూడ మండల అధ్యక్షుడు పర్నేం మల్లారెడ్డి, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ దాసరి బిక్షపతి, రామకృష్ణాపూర్ సర్పంచ్ పెండ్లి రాజు, పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు బండి సదానందం గౌడ్, మార్క రఘుపతి గౌడ్, ఏకు రాజు, నల్లెల్ల అనిల్ కుమార్, కొత్తపెల్లి రవి, బొచ్చు జెమిని తదితరులు పాల్గొన్నారు.

